

'కడెం' మరమ్మతులు పూర్తయ్యేనా?
కడెం ప్రాజెక్ట్ మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయి. వానాకాలం సమీపిస్తున్నా నేటికీ పనులు పూర్తి కాకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో▶



ఆలయాలే టార్గెట్
ఆలయాలను లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. తాళాలు పగుల గొట్టి లోనికి చొరబడుతూ హుండీలు, విగ్రహాల పై ఉన్న ఆభరణాలు ఎత్తుకెళ్తున్నారు. 8లో▶

గరిష్ఠం/కనిష్ఠం
37.0 /27.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పాక్షికంగా, పలుచోట్ల పూర్తిగా మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

గోదావరికి హారతి



హారతి ఇస్తున్న వేద విద్యార్థులు

భైంసా: బాసరలో గోదావరి నదికి వేదభారతి విద్యాపీఠం ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా నిత్యహారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం గంగమ్మతల్లికి పూజలు చేశారు. హోమం నిర్వహించారు. వేదభారతి పీఠం వ్యవస్థాపకుడు వేద విద్యానంద గిరిస్వామీజీ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం వేద పాఠశాల విద్యార్థులు గోదావరినదికి హారతి ఇచ్చారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు. హారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆర్టీసీ డిపోలో వైద్యపరీక్షలు



ఉద్యోగితో మాట్లాడుతున్న వైద్యులు, సిబ్బంది

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్‌లో భాగంగా సంస్థలో పని చేసే ఉద్యోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యులు విద్యాసాగర్‌రావు, చంద్రిక ఆధ్వర్యంలో 60 మంది ఉద్యోగులకు బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి మాత్రలు అందజేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులు బాధ్యతతో పాటు, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్, సహాయ మేనేజర్లు రాజశేఖర్, నవీన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

గోదావరినదిలో పూడికతీత పనుల పరిశీలన



పాక్‌పట్లలో కూలీలతో విజయలక్ష్మి

సోన్: మండలంలోని పాక్‌పట్ల, లోకల్ వెల్మల్, సిద్దులకుంట, గాంధీనగర్ గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులను బుధవారం డీఆర్డీవో విజయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గోదావరి నదిలో పూడిక తీత పనులు చేపట్టడంతో భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. వేసవి దృష్ట్యా కూలీలు ఉదయం పనులకు తొందరగా రావాలని, వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సకాలంలో కూలి డబ్బులు ఖాతాల్లో జమ అవుతున్నాయా? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏపీవో మంజులారెడ్డి, టీఏ కృష్ణ తదితరులున్నారు.

తడిసిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

లక్ష్మణచాంద: జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా కల్లాల్లో తడిసిన వరి ధాన్యాన్ని అధికారులు వెంటనే కొనుగోలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.గంగన్న బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. దళారులు, మిల్లర్లు కుమ్మక్కై బస్తాకు రెండు నుంచి మూడు కిలోల కోత విధిస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారని ఆరోపించారు. వెంటనే అధికారులు స్పందించి కోతలు లేకుండా రైతుల ధాన్యం కొనుగోలు చేసేలా చూడాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన హామీలో భాగంగా రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎవరు గెలుస్తరంటవ్?

- కమలం.. హస్తం మధ్యే పోరు!
- 'కారు'కు కష్టమేనంటున్న జనం
- అంచనాలకు అందని ఫలితాలు
- ఆరా తీస్తున్న పార్టీల నాయకులు
- ఆసక్తిగా చర్చిస్తున్న జిల్లావాసులు



నిర్మల్: 'అవన్న.. ఓట్లు గెలుస్తరంటవ్.. మీ దగ్గర ఓట్లు ఎటేసింండ్రు. మా దగ్గరైతే కొంతమంది తప్ప అందరూ ఆ పార్టీకే గుద్దింండ్రు. మీ అక్కడ ఎటు పడ్డయన్న..' అంటూ ప్రస్తుతం జిల్లా అంతటా ఎంపీ ఎన్నికలపైనే చర్చ నడుస్తోంది. పోలింగ్ పూర్తయి రెండురోజులైనా.. ఎక్కడ.. ఏ నలుగురు కలిసినా.. ఇదే ముచ్చట వినిపిస్తోంది. జిల్లావాసులే కాకుండా పక్కజిల్లాలకు చెందిన వాళ్లు పోలింగ్ తీరు గురించి ఆసక్తిగా అడుగుతున్నారు. మన జిల్లావాళ్లు.. ఇతర జిల్లాల్లో పోలింగ్ తీరుపై ఆరా తీస్తున్నారు. మొత్తం మీద.. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు ఎటు పడ్డయన్న చర్చ జోరుగా సాగుతోంది. ఫలితాల విషయంలో మాత్రం ఎవరూ ఓ అంచనాకు రాలేకపోతుండటం గమనార్హం. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ ఆసక్తికరంగా సాగింది. పోలింగ్ కూడా పెరగడంతో ఫలితంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఓట్ల లెక్కలేసుకుంటున్నరు..
పోలింగ్ పూర్తయిన వెంటనే అభ్యర్థులు, పార్టీల నాయకులతో పాటు సామాన్యులూ ఓట్ల లెక్కలు వేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో ఎవరు గెలుస్తరు.. బీజేపీకి మళ్లీ అవకాశమిస్తరా..? ఈసారి కాంగ్రెస్‌ను గెలిపిస్తరా..? ఈ రెండుపార్టీల్లో ఏ పార్టీకి ఏయే వర్గాలు ఓట్లేశాయి..? ఎవరు వేయలేదు.. తదితర విషయాలపై ఆరా తీస్తున్నారు. ఎవరెవరికి ఎక్కడెక్కడ ఓట్లు పడ్డాయనే అంచనాలు రెండురోజులుగా కొనసాగుతూనే ఉన్నాయి. జిల్లాలోని నిర్మల్, ముధోల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓ జాతీయపార్టీకి అధికంగా ఓట్లు పడగా, ఖానాపూర్‌లో మాత్రం మరో జాతీయ పార్టీకి కొంత సానుకూలంగా ఓట్లు పడ్డట్లు అంచనా వేస్తున్నారు. ప్రాంతీయ పార్టీపై మాత్రం ఈసారి ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపనట్లు ఓటింగ్ తీరు చెబుతోందంటున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని మిగతా సెగ్మెంట్ల తీరుపై ఆరా తీస్తున్నారు. వాటితో జిల్లా లెక్కలను సరిచూసుకుని విజేతలెవరో.. నిర్ణయించుకుంటున్నారు.

హాట్‌హాట్‌గా పోటీ..
గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఏ పార్టీకి ఎలా ఉండనుందో.. ఏ అభ్యర్థికి అనుకూలం కానుందన్న లెక్కలపైనే ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. ఎంపీ స్థానానికి ఎన్నడూ లేనంతగా ఈసారి ఎన్నికలు హాట్..హాట్‌గా సాగడం అభ్యర్థులు, ఆయా రాజకీయ పార్టీల నేతల్లోనూ గుబులు రేపుతోంది. బుల్లిపెట్టెలో దాగిన వాళ్ల భవితవ్యం తేలాలంటే జూన్ 4దాకా ఆగాల్సిందే. కానీ.. ఆలోపు తమకు వచ్చిన ఓట్లు తెలుసుకోవాలన్న తపన వాళ్లలో కనిపిస్తోంది.

వర్గాలుగా విడిపోయి..
ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఫలానా పార్టీ గెలుస్తుంది.. ఫలానా అభ్యర్థి ఈసారి గెలుస్తాడు.. అన్న సంగతి ఎన్నికలకంటే ముందే చెప్పే అవకాశం ఉంటుంది. కానీ.. ఈసారి పార్లమెంట్ పోరు కాసింత సీరియస్‌గానే సాగింది. ప్రధానంగా రెండు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌కు బీఆర్‌ఎస్ ఏమాత్రం పోటీ ఇవ్వలేదని తెలుస్తోంది. క్షేత్రస్థాయిలోనూ జిల్లాలో పోలింగ్‌రోజు చాలాచోట్ల ఆ పార్టీకి కనీసం ఏజెంట్లు కూడా లేకపోవడమే ఇందుకు నిదర్శనం. ఈలెక్కన ఆ పార్టీ ఓట్లు రెండు జాతీయ పార్టీల్లో ఎవరికి పడ్డాయన్నది ఆసక్తిగా మారింది. సామాజిక వర్గాలుగాను ఓటర్లు విడిపోయి ఓటేసినట్లు పార్టీలు భావిస్తున్నాయి. దీంతో వారి ఓట్లు ఎన్ని ఉన్నాయన్న లెక్కలూ తీస్తున్నారు. మొత్తం మీద పార్లమెంట్ ఫలితం తేలాలంటే జూన్ 4వరకు వేచిచూడాల్సిందే.

జిల్లా ఓట్లే కీలకం
ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇందులో జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు చాలా కీలకమైన తీర్పునిస్తూ వస్తున్నాయి. నిర్మల్ నియోజకవర్గ పరిధిలో 2,58,314 మంది ఓటర్లుండగా 1,85,168 మంది ఓటేశారు. ముధోల్ పరిధిలో 2,54,579 మందికి 1,92,546మంది, ఖానాపూర్ నియోజకవర్గంలో 2,24,623మంది ఓటర్లుండగా 1,62,101మంది ఓటేశారు. జిల్లాలో ఎప్పుడూ లేనివిధంగా గణనీయంగా 73.20శాతం పోలింగ్ నమోదైంది. జిల్లా మొత్తంలో 7,37,516మంది ఓటర్లున్నారు. ఇందులో మైదానప్రాంత ఓటర్లే అధికంగా ఉన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో నిర్మల్ జిల్లాలోనే మైదాన ప్రాంతం అధికంగా ఉంటుంది. ఎంపీ స్థానం ఎస్టీ రిజర్వ్‌డ్ కావడంతో మిగతా ప్రాంతాల కన్నా.. జిల్లాలోని మైదాన ప్రాంత ఓటర్లు ఎటువైపు వేశారన్నదే కీలకంగా మారుతోంది. గత ఎన్నికల్లోనూ బీజేపీ అభ్యర్థి విజయాన్ని నిర్మల్ జిల్లానే డిసైడ్ చేసింది.

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు రానివ్వొద్దు

- రైతులు నష్టపోకుండా చూడాలి
- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- అధికారులతో సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ధాన్యం కొనుగోళ్లు, వర్షాలతో రైతులు నష్టపోకుండా తీసుకోవాల్సిన చర్యలు, సీఎంఆర్ సరఫరా తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని, కేంద్రాల్లో టార్పాలిన్లు, క్లీనింగ్ మిషన్లు, గన్నీ సంచులు అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలని, ఇందుకు అవసరమైన లారీలను సమకూర్చుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో కేంద్రాలను పర్యవేక్షించి రోజువారీ నివేదికలు అందించాలని తెలిపారు. విధులను నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సీఎంఆర్ సరఫరాపై మిల్లుల వారీగా చర్చించారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఎస్వో నందిత, డీఎం సివిల్ సప్లయీస్ శ్రీకళ, డీసీవో నర్సయ్య, డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, మార్కెటింగ్ ఏడీ అశ్వాక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెమ్యునరేషన్ ఎప్పుడిస్తరో!



జిల్లా కేంద్రంలోని ఇంటర్ నోడల్ అధికారి కార్యాలయం

- ఆరువారాలు దాటినా అందని ఇంటర్ మూల్యాంకనం డబ్బులు
- నిరీక్షిస్తున్న 500 మంది ఏఈలు
- జిల్లాకు రావాల్సింది రూ.90లక్షలు

లక్ష్మణచాంద: జిల్లాలో ఇంటర్ పరీక్షల మూల్యాంకనం ముగిసి ఆరువారాలైనా అధ్యాపకులకు రెమ్యునరేషన్ డబ్బులు అందలేదు. ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం మూల్యాంకనం గత మార్చి 16నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు కొనసాగింది. ఫలితాలు కూడా వెల్లడయ్యాయి. కానీ.. మూల్యాంకనం విధులు నిర్వర్తించిన అధ్యాపకులు రెమ్యునరేషన్ కోసం నిరీక్షిస్తూనే ఉన్నారు. గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగా ఇంటర్ మూల్యాంకనం నిర్వహించేవారు. నిర్మల్ జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత ఇక్కడే జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలోనే ఇంటర్ మూల్యాంకనం నిర్వహిస్తున్నారు. జిల్లాలో 500 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు (ఏఈలు) పేపర్ వాల్యుయేషన్‌లో పాల్గొనగా, వీరికి రెమ్యునరేషన్ అందలేదు.

రెమ్యునరేషన్ ఇలా..
ఇంటర్ మూల్యాంకనం విధులకు హాజరైన ఏఈలకు ఒక్కో పేపర్ వాల్యుయేషన్ చేసినందుకు రూ. 23.66 ఇవ్వాల్సి ఉంటుంది. రోజుకు ఒక్కో ఏఈ 30 పేపర్లు వాల్యుయేషన్ చేస్తారు. అలాగే ఒక్కో రోజుకు డీఏ, 50కిలో మీటర్ల లోపు వారికి రూ.400, లోకల్ వారికి రూ.188, 50కిలోమీటర్ల పైన ఉన్న వారికి రూ.703 రెమ్యునరేషన్‌తోపాటు చెల్లిస్తారు.

గతంలో చివరిరోజే..
కొత్త జిల్లాల ఏర్పాటుకు ముందు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఇంటర్ వాల్యుయేషన్ ప్రక్రియ నిర్వహించేవారు. గతంలో మూల్యాంకనం చివరిరోజే అధ్యాపకులకు పూర్తి రెమ్యునరేషన్ చెల్లించేవారు. నాలుగేళ్లుగా అధ్యాపకుల నుంచి బ్యాంక్ ఖాతాలు తీసుకుని వారంలోపు మూల్యాంకనం డబ్బులు జమ చేసేవారు. గతేడాది నుంచి మాత్రం రెమ్యునరేషన్ చెల్లింపులో విపరీతమైన జాప్యం చేస్తుండడంతో అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈసారి జిల్లాకు రావాల్సిన రెమ్యునరేషన్ డబ్బులు రూ.90 లక్షలు నేటికీ అందలేదని అధ్యాపకులు వాపోతున్నారు.

మారిన ఇంటర్‌బోర్డు తీరు
గతంలో ఇంటర్ మూల్యాంకనం కోసం అయ్యే డబ్బులను ముందుగా ఇంటర్ నోడల్ అధికారి అకౌంట్‌లో ఇంటర్ బోర్డు వారు జమ చేసేవారు. ఇంటర్ నోడల్ అధికారి మూల్యాంకనం ముగిసిన వెంటనే అధ్యాపకుల రెమ్యునరేషన్ లెక్కించి వెంటనే ఖాతాల్లో వారంలోపే జమ చేసేవారు. కానీ.. గతేడాది నుంచి ఇంటర్ బోర్డు వారు నేరుగా అధ్యాపకుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పడంతో ఇంటర్ నోడల్ అధికారి మూల్యాంకనం చేసిన అధ్యాపకుల వివరాలు ఇంటర్ బోర్డుకు అప్‌లోడ్ చేస్తున్నారు. కానీ.. బోర్డు వారు మాత్రం అధ్యాపకుల మూల్యాంకనం డబ్బులు ఇప్పటివరకు జమ చేయలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మూల్యాంకనం డబ్బులు ఖాతాల్లో జమ చేయాలని విధులు నిర్వర్తించిన అధ్యాపకులు కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



ప్రైవేట్ కళాశాలల్లోని అధ్యాపకులకు సరైన వేతనాలుండవు. ఇంటి ఖర్చులు తీరుతాయని ఇంటర్ మూల్యాంకనానికి వెళ్లాను. మూల్యాంకనం పూర్తయి, ఫలితాలు వచ్చినా నేటికీ నాకు రావాల్సిన రూ.11వేలు అందలేదు. ఆర్థికంగా ఇబ్బందవుతోంది.
– రమేశ్, అధ్యాపకుడు

త్వరగా వచ్చేలా చూడాలి



ఇంటర్ మూల్యాంకనం కోసం వెళ్లిన అధ్యాపకులకు డబ్బులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఇంటర్ విద్యాశాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మూల్యాంకనం డబ్బులు అధ్యాపకుల ఖాతాల్లో జమ చేసి ఇబ్బందులు తీర్చాలి.
– రాజేశ్వర్, అధ్యాపకుడు

బోర్డుకు వివరాలు పంపాం



మార్చి 16న ప్రారంభమైన ఇంటర్ మూల్యాంకనంఏప్రిల్ 6న ముగిసింది. మూల్యాంకనం ముగిసిన వెంటనే ఇంటర్ బోర్డుకు అధ్యాపకుల రెమ్యునరేషన్, వారి బ్యాంక్ ఖాతా వివరాలు అప్‌లోడ్ చేశాం. మూడు, నాలుగు రోజుల్లో జమయ్యే అవకాశం ఉంది.
– పరశురామ్‌నాయక్, ఇంటర్ నోడల్ అధికారి

పనుల్లో నాణ్యత పాటించాలి

- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై అధికారులతో సమీక్షా సమావేశం



కలెక్టర్‌కు వెదురుబుట్ట ఇస్తున్న నవీన్

నిర్మల్‌చైన్‌గేట్: నాణ్యతా ప్రమాణాలతో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనులను జూన్ 5లోపు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లో తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం, నీటి సదుపాయం, ప్రహరీ రిపేర్లు, విద్యుత్ పనులు, స్లాబ్‌ల మరమ్మతు, గ్రిల్స్ ఏర్పాటు, పెయింటింగ్స్ తదితర పనులు చేపట్టాలని పేర్కొన్నారు. పనుల ప్రారంభానికి ముందు, తర్వాత ఫొటోలతో కూడిన నివేదికలు అందించాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోపు పనుల పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలల్లో చేపట్టిన పనులు, మరమ్మతుకు సంబంధించిన వివరాలు మండలాల వారీగా సమీక్షించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు, ఎంఈవోలు పాల్గొన్నారు.

వెదురుబుట్ట అందజేత
పెంబి మండలం కొలంగూడ, పసుపుల గ్రామపంచాయతీలకు చెందిన గిరిజనులు చేతితో అల్లిన వెదురుబుట్టను నీతి ఆయోగ్ ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమ ప్రతినిధి నవీన్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌కు ఆయన ఛాంబర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా పెంబి మండలంలో నీతి ఆయోగ్ ఎంపిక చేసిన బ్లాక్‌లలో చేపట్టిన కార్యక్రమానికి సంబంధించి పురోగతిని కలెక్టర్‌కు వివరించారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం



కడెం: కొత్తమద్దిపడగ కొనుగోలు కేంద్రంలోని ధాన్యం కుప్పల్లో నిలిచిన వర్షపునీరు



ఖానాపూర్: బావాపూర్(కే)లో..



కుంటాల: అందాకూర్‌లో తడిసిన మక్కలు

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(కే) గ్రామంలో బుధవారం కురిసిన అకాల వర్షానికి రైతుల వరి ధాన్యం తడిసిపోయింది. గ్రామంలో పక్షం రోజుల క్రితం వరి కోతలు ప్రారంభించినా నేటికీ కొనుగోలు కేంద్రం ప్రారంభించలేదని రైతులు వాపోయారు. వెంటనే ప్రారంభించాలని కోరారు.

కడెం మండలంలో..
కడెం: మండలంలోని కడెం, కొండుకూర్, పాండ్వపూర్, మద్దిపడగ తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో నీరు నిలిచింది. దీంతో కొంత మేర రైతుల ధాన్యం తడిసింది. ప్రభుత్వం టార్పాలిన్లు అందించాలని ఈ సందర్భంగా రైతులు డిమాండ్ చేశారు.

కుంటాల మండలంలో..
కుంటాల: మండలంలోని కల్లూర్ అందాపూర్, ఓలా, కుంటాల, పెంచికల్‌పాడ్, అంబకంటి, సూర్యాపూర్, లింబా(కే), లింబా(బీ) తదితర గ్రామాల్లో మంగళవారం రాత్రి వర్షం కురిసింది. అందాకూర్‌లో ఆరబోసిన మక్కలు తడిసి రంగు మారాయి. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

నర్సాపూర్(జీ) మండలంలో..
నర్సాపూర్ (జీ): మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో మంగళవారం రాత్రి వర్షం కురిసింది. ఎంపీపీ కొండ్ర రేఖ రమేశ్ బంగ్లాపై ఉన్న హోర్డింగ్ కింద పడింది. ఆయా గ్రామాల్లో విద్యుత్ అంతరాయమేర్పడి జనాలు ఇబ్బంది పడ్డారు.



గుమ్మెనలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్‌టవర్

ట్రబుల్ బూత్ నంబర్ 227

- దొందరిలో అష్టకష్టాల మధ్య పోలింగ్

ఖానాపూర్: నియోజకవర్గంలోని పెంబి మండలం మారుమూల గ్రామాలైన వస్‌పెల్లి, దొందరి గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ అష్టకష్టాల మధ్య సాగింది. పెంబి మండల కేంద్రం నుంచి సుమారు 20 కిలోమీటర్ల దూరంలోని ఈ గిరిజన గ్రామాలకు కొసగుట్ట మీదుగా వెళ్తే చిక్‌మన్‌వాగు, కడెం వాగు, అటవీ ప్రాంతం ఉంటుంది. గుమ్మెన ఎంగ్లాపూర్ గ్రామం మీదుగా వెళ్లినా వాగులతోపాటు అడవి ఉంటుంది. గత 13వ తేదీన నిర్వహించిన ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించేందుకు అధికారులు ఉట్నూర్‌లోని రిసెప్షన్ నుంచి పోలింగ్ సామగ్రితో ప్రత్యేక వాహనంలో పెంబికి చేరుకున్నారు. అక్కడి నుంచి గతుకుల రోడ్డు మీదుగా దట్టమైన అటవీ ప్రాంతం మీదుగా ఇటిక్యాల తండా, గుమ్మెనకు వెళ్లారు. అక్కడ రాత్రి వర్షం ప్రారంభం కాగా, వస్‌పల్లి వరకు ఫోర్ వీలర్‌ను తోసుకుంటూ వెళ్లారు. అక్కడ ఫోర్‌వీలర్ బురదలో దిగబడింది. రాత్రి 11గంటలకు భారీ వర్షంలోనూ నాలుగు కిలోమీటర్ల దూరంలోని దొందరికి కమ్యూనికేషన్ పోలీస్ అధికారులు, సిబ్బంది, సెక్టోరల్ అధికారులు, ఇతర సిబ్బంది ఎండ్లబండిపై రాత్రి 11.55కి చేరుకున్నారు. ఆ వెంటనే అధికారులకు రిపోర్టు చేయగా 13న పోలింగ్ ప్రక్రియ సాఫీగా జరిగింది. కలెక్టర్ కంట్రోల్ రూమ్‌తో పాటు రిటర్నింగ్ అధికారికి ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేసేందుకు సిగ్నల్ కోసం గుమ్మెనలో టవర్ ఏర్పాటు చేశారు. రూట్ ఆఫీసర్ గంగజల, సెక్టోరియల్ ఆఫీసర్ బోజదాస్, ఐటీ అండ్ సీ (కమ్యూనికేషన్ పోలీస్ అధికారులు) ఎస్సై గంగాసాగర్, కానిస్టేబుల్ రాజ్‌కుమార్ తదితరులు కమ్యూనికేట్ చేస్తూ అష్టకష్టాలు పడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గుమ్మెన గ్రామస్తులు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎన్నికలు బహిష్కరించి ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. వాగులు పొంగిపొర్లడంతో అప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేయగా, వారం తర్వాత మళ్లీ నిర్వహించారు.



వస్‌పల్లి, దొందరికి వెళ్లే మార్గంలో దట్టమైన అడవి

క్లుప్తంగా

రెండు ఇసుక టిప్పర్లు పట్టివేత



టిప్పర్లతో మైనింగ్ శాఖ టీఏ

బేల: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బ్రిడ్జి వద్ద బుధవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ రమేశ్ పవార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కాంఘర్‌పూర్ రెవెన్యూ గ్రామ శివారులోని పెన్‌గంగ నుంచి జిల్లా కేంద్రానికి ఇసుక తరలిస్తున్న క్రమంలో ఈ రెండు టిప్పర్లు పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామన్నారు. దీనిపై జిల్లా మైనింగ్ శాఖ ఏడీకి నివేదించినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మృతి చెందిన ఆవు వద్ద గంగయ్య

ఇచ్చోడ: మండలంలోని గేర్జం గ్రామంలో గంగయ్య అనే రైతుకు చెందిన ఆవు విద్యుదాఘాతంతో బుధవారం మృతి చెందింది. రెండు రోజుల క్రితం ఈదురుగాలులతో కురిసిన వర్షానికి పంటపొలాల్లో త్రీఫేజ్ విద్యుత్ తీగలు తెగిపోయాయి. మేతకు వెళ్లిన ఆవు విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.40 వేల వరకు ఉంటుందని, పరిహారం అందించి తమను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

విద్యుదాఘాతంతో 9 మేకలు మృతి



మృతి చెందిన మేకలు

నేరడిగొండ: మండలంలోని లక్ష్మీపూర్‌లో ఆడేం అర్జున్‌కు చెందిన తొమ్మిది మేకలు విద్యుత్ షాక్‌కు గురై బుధవారం మృతిచెందాయి. మొత్తం 80 మేకలను మేత కోసం అడవికి తీసుకెళ్లే క్రమంలో గ్రామ సమీపంలో విద్యుత్ వైర్లు తెగిపడి ఉండటంతో వాటికి తగిలి సంఘటన స్థలంలోనే మృతి చెందాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే మేకలు మృతి చెందాయని రైతు వాపోయాడు. మేకల విలువ సుమారు రూ.లక్షకు పైగా ఉంటుందని, ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

'కడెం' మరమ్మతులు పూర్తయ్యేనా?

- సమీపిస్తున్న వానాకాలం
- ఇప్పటికీ పూర్తికాని పనులు
- అయోమయంలో ఆయకట్టు రైతాంగం



కడెం ప్రాజెక్ట్

కడెం: రెండేళ్లుగా వానాకాలంలో కురుస్తున్న వర్షాలకు కడెం ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో వరద గేట్లు పనిచేయకపోవడంతో ప్రాజెక్టు డేంజర్ జోన్‌లోకి వెళ్లింది. 2022లో భారీగా వరదనీరు వచ్చినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. 2023లో కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదనీటితో ప్రాజెక్ట్ అతలాకుతలం అయ్యింది. వరదలకు దెబ్బతిన్న ప్రాజెక్ట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే నిధులు కేటాయించడంతో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. వానాకాలం సమీపిస్తున్నా ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు. సీజన్ ప్రారంభం నాటికి పనులు పూర్తి అవుతాయో లేదోనని ఆయకట్టు రైతాంగం అయోమయంలో ఉంది. ప్రాజెక్ట్ మరమ్మతు పనులను పరిశీలించేందుకు బుధవారం నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ అనిల్‌కుమార్‌తో పాటు అధికారుల బృందం ప్రాజెక్ట్‌ను సందర్శించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వారి పర్యటన వాయిదా పడింది.

పనులు పూర్తయ్యేనా..

రెండేళ్లుగా వచ్చిన భారీ వరదలకు దెబ్బతిన్న ప్రాజెక్ట్ మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5.46 కోట్ల నిధులు విడుదల చేయడంతో పనులు కొనసాగుతున్నాయి. మొత్తం 9 ఇండియన్ గేట్లలో ఏడు గేట్లకు రూలర్స్ అమర్చారు. మరో రెండు గేట్లకు అమర్చాల్సి ఉంది. 11 వరద గేట్లకు రబ్బర్ సీల్స్ అమర్చారు. 9 జర్మనీ గేట్లలో 7 గేట్లకు గేర్ బాక్స్‌లు అమర్చారు. మరో రెండింటికి అమర్చాలి. రెండు వరద గేట్లకు కౌంటర్ వెయిట్‌లు, వైర్ రోప్స్ అమర్చాలి. 9 జర్మనీ గేట్లకుగానూ 7 గేట్లకు బ్రేక్ లైనర్స్ అమర్చారు. మరో రెండు గేట్లకు అమర్చాలి. నాలుగు వరద గేట్లకు కొత్త మోటార్లు బిగించాల్సి ఉంది. ప్రాజెక్ట్ ఎలక్ట్రికల్ పనుల నిమిత్తం ఇటీవలే నిధులు విడుదలయ్యాయి. టెండర్ పూర్తి కాక పనులు ప్రారంభం కాలేదు. దీంతో వైరింగ్, ప్యానెల్ బోర్డ్స్, స్టార్టర్స్, తదితర ఎలక్ట్రికల్ పనులు పూర్తి కాలేదు. సివిల్ వర్క్‌లో భాగంగా స్పిల్‌వే పనులు కొనసాగుతుండగా అప్రాన్, వాల్స్ పనులు పూర్తయ్యాయి.



కొనసాగుతున్న వరద గేట్ల మరమ్మతులు

ఆయకట్టుకు సాగునీరివ్వాలి



కడెం ప్రాజెక్ట్ మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలి. ప్రాజెక్ట్ మరమ్మతులు చేపట్టకపోవడంతోనే ఈ ఏడాది యాసంగికి సాగు నీరివ్వలేదు. ఇప్పటికైనా ప్రాజెక్ట్ పూర్తిస్థాయి మరమ్మతులు సకాలంలో పూర్తిచేసి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలి.
– రాజేశ్, రైతు, దస్తురాబాద్

జూన్ 15లోగా పూర్తి



కడెం ప్రాజెక్ట్ వరద గేట్ల పనులు కొనసాగుతున్నాయి. రోలర్స్, రబ్బర్ సీల్స్, తదితర పనులు పూర్తయ్యాయి. రెండు వరద గేట్లకు కౌంటర్ వెయిట్‌లు బిగించాలి. ఎలక్ట్రికల్ టెండర్ ప్రక్రియ పూర్తి కానందువల్ల పనులు చేపట్టలేదు. జూన్ 15 లోగా మరమ్మతు పనులు పూర్తి చేస్తాం.
– భోజదాసు, డీఈ, కడెం ప్రాజెక్ట్

ఆలయాలే టార్గెట్..!



జామ్‌లోని మహాలక్ష్మీ ఆలయంలో విచారణ చేపడుతున్న పోలీసులు

- పది రోజుల వ్యవధిలో రెండు దేవాలయాల్లో చోరీ
- తాజాగా జామ్ మహాలక్ష్మీ ఆలయంలో..
- భయాందోళనలో ప్రజలు

సారంగపూర్: ఆలయాలనే టార్గెట్‌గా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. పది రోజుల వ్యవధిలో మండలంలోని రెండు దేవాలయాల్లో చోరీకి పాల్పడిన గుర్తు తెలియని దుండగులు బంగారు ఆభరణాలు, నగదు అపహరించారు. ఇటీవల మండలంలోని ఆలూరు గ్రామ సమీపంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీ జరగగా తాజాగా మంగళవారం రాత్రి జామ్ గ్రామ సమీపంలోని మహాలక్ష్మీ దేవాలయంలో దొంగలు పడ్డారు. ఆలయ ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి అమ్మవారి రెండు గ్రాముల బంగారు ముక్కుపుడకలు, పుస్తెలతో పాటు హుండీని ధ్వంసంచేసి అందులోని నగదును అపహరించారు. బుధవారం తెల్లవారుజామున ఆలయానికి వచ్చిన భక్తులు చోరీ జరిగిన విషయం గమనించి గ్రామస్తుల ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆలయ పరిసరాల్లో గాలించగా కొంతదూరంలో హుండీ ధ్వంసం చేసి ఉంది. మరో డబ్బాలో దాచిన వెండికళ్లు, ఇతర సామగ్రి అలాగే వదిలేసినట్లు గుర్తించారు. అమ్మవారి విగ్రహానికి అంటించి ఉన్న వెండి కళ్లు కూడా అలాగే వదిలేసి కేవలం బంగారం, నగదును మాత్రమే అపహరించారు.

రెండు ఆలయాల్లోనూ అదే తీరు..

ఇటీవల సారంగపూర్ మండలం ఆలూరు గ్రామ సమీపంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీకి పాల్పడిన దొంగలు దేవాలయంలోని హుండీని పగులగొట్టి అందులోంచి నగదును అపహరించారు. అలాగే అమ్మవారికి అలంకరించిన మూడు జతల బంగారు పుస్తెలు (రెండు గ్రాములు), బంగారు బొట్టుబిళ్ల, రెండు గ్రాముల వెండి మెట్టెలు దొంగిలించారు. తాజాగా జరిగిన జామ్ మహాలక్ష్మీ దేవాలయంలోనూ ఇదేరీతిలో చోరీ జరిగింది.

చిన్న ఆలయాలే టార్గెట్

గ్రామాలకు దూరంగా ఉన్న చిన్న చిన్న ఆలయాలనే దొంగలు టార్గెట్‌గా ఎంచుకున్నట్లు ఈ రెండు ఘటనల ద్వారా తెలుస్తోంది. చీకటి పడితే ఆలయాలకు తాళం వేసి పూజారులు ఇళ్లకు వెళ్లిపోతారు. ఆలయ సమీపంలో జనసంచారం ఉండదు. కనుక ఇలాంటి ఆలయాలనే దొంగలు ఎంచుకుని వరుసగా దొంగతనాలకు పాల్పడుతున్నారు.

పనిచేయని నిఘా నేత్రాలు

మండలంలోనే అతిపెద్ద గ్రామ పంచాయతీ అయిన జామ్ గ్రామంలో రెండు వీడీసీలున్నాయి. వీటి ఆధ్వర్యంలో ఐదేళ్ల క్రితం దాదాపు 15 వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ వాటి నిర్వాహణ సక్రమంగా లేకపోవడంతో అవికాస్తా మూలనపడి అలంకారప్రాయంగా మారాయి. ఒకవేళ సీసీకెమెరాలు పనిచేసి ఉంటే దొంగలు పట్టుబడేవారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఏదేమైనా పది రోజుల వ్యవధిలోనే రెండు ఆలయాల్లో చోరీ జరగడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆలయాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

నిందితులను త్వరలోనే పట్టుకుంటాం

గ్రామాలకు దూరంగా ఉన్న చిన్న ఆలయాలనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. ఇటీవల పెద్దమ్మతల్లి ఆలయంలోనూ ఇదేవిధంగా చోరీ జరిగింది. నిందితులను త్వరలోనే పట్టుకుంటాం. గ్రామస్తులు సైతం ఆలయాల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. పెట్రోలింగ్ సిబ్బందిని అప్రమత్తం చేశాం.
– చంద్రమోహన్, ఎస్సై, సారంగపూర్

గురుకులాన్ని సందర్శించిన కేంద్ర బృందం



పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

బోథ్: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలను బుధవారం హైదరాబాద్ నుంచి వచ్చిన కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు చెందిన అధికారుల బృందం పరిశీలించింది. కొంత కాలంగా కేంద్రం జలశక్తి మంత్రిత్వ శాఖ నీటి పొదుపుపై పలు పాఠశాలలు, కళాశాలలకు అవార్డులు అందజేస్తోంది. ఇందుకోసం రాష్ట్రంలో రెండు గురుకుల పాఠశాలలు ప్రొవిజనల్ జాబితాలో ఉండగా అందులో బోథ్‌లోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల ఒకటి. ఈ క్రమంలో పాఠశాలలో నీటి పొదుపు అంశంపై పరిశీలించారు. నీటి సంరక్షణ నీటి పొదుపు తీసుకుంటున్న చర్యలను తెలుసుకున్నారు. నీటి పునర్వినియోగం పద్ధతులు, నిర్మాణాలను పరిశీలించారు. వారి వెంట పరిశీలనా బృందం శాస్త్రవేత్త ఉపేందర్, ఇంజనీర్ కృతిక, బోథ్ ఎంపీడీవో రమేశ్, ఏపీవో జగ్దేరావ్, ఏపీడీ కృష్ణారావు, సూర్యప్రకాష్, ఉపాధ్యాయులు సంతోష్, అమాన్, శ్రీనివాస్ ఉన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య



పొచ్చన్న (ఫైల్)

తాంసి: మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన భీంపూర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన గుగ్గిల పొచ్చన్న (58) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించేందుకు డబ్బులు లేకపోవడంతో మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి ఊరిబయట ఉన్న వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం గమనించిన గ్రామస్తులు కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఎస్సై ప్రదీప్‌కుమార్ పరిశీలించి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య రమణాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హత్యాయత్నానికి పాల్పడ్డారని ఫిర్యాదు



పోలీస్ స్టేషన్ ఎదుట బీజేపీ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: తనపై కొంతమంది హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన బీజేపీ యువ మోర్చా నాయకుడు గటిక క్రాంతికుమార్ బుధవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది వ్యక్తులు తమ ఇంటికి వచ్చి బెదిరింపులకు పాల్పడడమే కాకుండా హత్యాయత్నం చేసినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు తనను టార్గెట్ చేస్తున్నారని, వారి నుంచి ప్రాణహాని ఉందన్నారు. వారి నుంచి తనకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. తనపై హత్యాయత్నానికి ఉసిగొల్పిన కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనకు మద్దతుగా పలువురు బీజేపీ నాయకులు టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు.

గ్రామస్తుల చేతిలో కొండ చిలువ హతం



పంటచేను వద్ద కొండచిలువ

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో బుధవారం గ్రామస్తులు కొండ చిలువను హతమార్చిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మోహన్‌పాటిల్ పంటచేనులో 12 అడుగుల కొండ చిలువ కనిపించడంతో అటుగా వెళ్తున్న కొందరు రైతులు దానిని హతమార్చారు.

దాడి చేసిన పలువురిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని పిట్టల్‌వాడకు చెందిన జాదవ్ గోపాల్‌పై దాడి చేసిన పలువురిపై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు. పిట్టల్‌వాడకు చెందిన జాదవ్ గోపాల్ బుధవారం దుర్గనగర్ కాలనీ నుంచి ద్విచక్ర వాహనంపై పిట్టల్‌వాడకు వస్తుండగా 170 కాలనీకి చెందిన అజయ్ మహకాల్‌తో పాటు పలువురు కర్రలు, రాడ్లతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అజయ్‌తో పాటు పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేషెంట్‌కేర్ ఆత్మహత్యాయత్నం

- సూపర్‌వైజర్ వేధింపులే కారణం
- రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలు



బాధితురాలి ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో పేషెంట్ కేర్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మి అనే మహిళా కార్మికురాలు బుధవారం తెల్లవారుజామున గైనిక్‌వార్డులో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన సిబ్బంది వెంటనే ఎమర్జెన్సీ వార్డుకు తరలించారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఆస్పత్రి అధికారులు అక్కడకు చేరుకుని ఘటనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. కాగా రిమ్స్‌లో మహిళా ఉద్యోగులపై వేధింపులు పరిపాటిగా మారాయి. నెల రోజుల క్రితం ఓ స్టాఫ్‌నర్సును పేషెంట్ కేర్‌గా పనిచేసే పురుష ఉద్యోగి వేధించిన విషయం తెలిసిందే.

అసలేం జరిగిందంటే ...

ఆదిలాబాద్ పట్టణం దస్నాపూర్‌కు చెందిన లక్ష్మి 16 ఏళ్లుగా రిమ్స్‌లో పారిశుద్ధ్య కార్మికురాలిగా, రెండేళ్లుగా పేషేంట్‌కేర్‌గా పనిచేస్తోంది. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి గైనిక్‌వార్డులో విధుల నిర్వహణకు హాజరైంది. పది గంటల సమయంలో ఛీప్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వ్యక్తి విధుల నుంచి వెళ్లిపోవాలని, రేపటి నుంచి డ్యూటికి రావాల్సిన అవసరం లేదని బెదిరింపులకు పాల్పడ్డట్లు బాధితురాలు వాపోయింది. మరో సూపర్‌వైజర్ గైనిక్‌వార్డులో పనిచేసే దాయమ్మ అనే మహిళ కూడా కొన్ని రోజులుగా మానసిక వేధింపులకు పాల్పడుతుందని కన్నీరుమున్నీరైంది. తనకు ముగ్గురు పిల్లలున్నారని, అకారణంగా ఉద్యోగం నుంచి తీసివేస్తే తమ కుటుంబం రోడ్డున పడుతుందని ఆవేదన వ్యక్తం చేసింది. అర్ధరాత్రి వేళ తాను ఇంటికి ఏ విధంగా వెళ్లాలని తన కుటుంబ సభ్యులు ఏమను కుంటారనోనని వేదనకు గురై మరుగుదొడ్డిలో ఉన్న ఫినాయిలు తాగింది. నోటి నుంచి నురగ రావడంతో స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం అక్కడి నుంచి తరలించారు.

విచారణ కమిటీ నియామకం

రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ స్పందించి సూపర్‌వైజర్ రవిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సమగ్ర విచారణ కోసం ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా తగు చర్యలు తీసుకోనున్నట్లుగా వెల్లడించారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఎదులాపురం: రిమ్స్‌లో పేషెంట్ కేర్‌గా పనిచేస్తున్న గణపతి లక్ష్మి ఆత్మహత్యాయత్నానికి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శులు నవీన్ కుమార్, అగ్గిమల్ల స్వామి, రిమ్స్ నాయకులు పెర్క దేవిదాస్, అక్రమ్ ఖాన్, సుభాష్, దశాంత్ రమేశ్, శేఖర్, ఖలీల్, సుమన్ తాయి, రాణి, అనసూయ, రిమ్స్ కార్మికులు పాల్గొన్నారు.

'ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదు'

ఎదులాపురం: రిమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులు, పేషెంట్ కేర్‌లు, కాంట్రాక్ట్ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి బుధవారం రిమ్స్‌లోని యూనియన్ భవనంలో ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గణపతి లక్ష్మిని మానసికంగా ఒత్తిడికి గురి చేసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడేందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్‌ను విధుల నుంచి తొలగించి బాధితురాలికి న్యాయం చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు డొంగ్రే చందు, రిమ్స్ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాసీం, అధ్యక్షురాలు సంగీత, యూనియన్ నాయకులు సంతోశ్, రాజేందర్ సింగ్, సైఫ్‌ఖాన్, రాథోడ్ రవీందర్, నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అండగా దోస్త్.. కోర్సులు మస్త్

- కొనసాగుతున్న తొలివిడత ప్రవేశాల ప్రక్రియ
- ఉమ్మడి జిల్లాలో 13 ప్రభుత్వ, 30కి పైగా ప్రైవేటు డిగ్రీ కళాశాలలు

నిర్మల్‌ఖిల్లా: ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ ఆఫ్ తెలంగాణ) ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గానూ బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీబీఎం, తదితర కోర్సుల్లో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ కళాశాలలన్నీ కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్నాయి. దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సందేహాల నివృత్తికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదులో జాగ్రత్తగా వ్యవహరించాలని, తప్పుగా నమోదు చేసినట్లు నిర్ధారించుకుంటే హెల్ప్‌లైన్ కేంద్రాలను సంప్రదించాలని కోరుతున్నారు.

సంప్రదాయ కోర్సులకు డిమాండ్..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 13 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, దాదాపు 30 వరకు ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇందులోని అన్ని రకాల కోర్సుల్లో కలిపి దాదాపు 18 వేలకు పైగా సీట్లు అందుబాటులో ఉన్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. డిగ్రీలో సంప్రదాయ కోర్సులకు ఆదరణ ఎక్కువగా ఉంది. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కొత్తరకం ఉపాధి కోర్సులను కూడా ప్రారంభిస్తోంది.

ప్రవేశాలు మూడు దశల్లో...

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు మూడు విడతల్లో జరగనున్నాయి. మే 6 నుంచి మొదటి ఫేజ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. రూ.200 రుసుంతో రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. ఈ నెల 20 నుండి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. జూన్ 6న తొలి విడత సీట్ల కేటాయింపు ఉంటుంది. జూన్ 7 నుండి 12 వరకు కేటాయించబడిన కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. నిర్దేశించిన తేదీల ప్రకారం రెండవ దశ, మూడవ దశ లో అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతుంది.

రెండో దశ..

రూ.400 రుసుంతో జూన్ 6 నుంచి 13 వరకు సెకండ్ ఫేజ్ రిజిస్ట్రేషన్ నిర్వహించనున్నారు. జూన్ 6 నుంచి 14 వరకు సెకండ్ ఫేజ్ వెబ్ ఆప్షన్లు ఉంటాయి. జూన్ 18న రెండో దశ సీట్ల కేటాయింపు జరుగుతుంది. జూన్ 19 నుంచి 24 వరకు సెల్ఫ్ రిపోర్టుకు అవకాశం కల్పించారు.

మూడో దశ..

జూన్ 19 నుంచి 25 వరకు 'దోస్త్' మూడో దశ రిజిస్ట్రేషన్ ఉండనుంది. రూ.400 రుసుంతో మూడో విడత రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. జూన్ 19 నుంచి 25 వరకు మూడో దశ వెబ్ ఆప్షన్లు ఉంటాయి. జూన్ 29న మూడో దశ సీట్ల కేటాయింపు జరుగుతుంది. జులై 8 నుంచి డిగ్రీ కళాశాలల తరగతులు ప్రారంభమవుతాయి.




నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

మొబైల్ యాప్ ద్వారా కూడా దరఖాస్తు..

మొబైల్ యాప్ ద్వారా కూడా దోస్త్ దరఖాస్తు చేసుకోవచ్చని హెల్ప్ డెస్క్ అధికారులు పేర్కొంటున్నారు. స్మార్ట్ ఫోన్లలోని ప్లే స్టోర్ నుంచి డిగ్రీ దోస్త్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో సూచించిన ప్రకారం మొబైల్ నంబర్ ఓటీపీతో వెబ్‌సైట్లోకి ప్రవేశించి సంబంధిత రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. వెబ్ ఆప్షన్ల తర్వాత ఏ కాలేజీలో సీట్ అలాట్ అయిందో కూడా తెలుసుకోవచ్చు. వెబ్ ఆప్షన్స్ నమోదు సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సమీపంగా ఉన్న వాటిని ముందుగా ఎంచుకుని ఆ తర్వాత ప్రాధాన్యత క్రమంలో దూరంగా ఉన్న వాటిని పెట్టుకోవాలని సూచిస్తున్నారు. కోర్సులు కూడా తమకు నచ్చిన వాటిని తొలుత, ఆ తర్వాత ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసుకోవాలని కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రస్తుతం పోటీ ప్రపంచంలో ఎన్నో కొత్త కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. వృత్తి విద్యా కోర్సులతో పాటు సంప్రదాయ డిగ్రీ కోర్సులకు సైతం డిమాండ్ ఉంది. కిందిస్థాయి ఉద్యోగాల నుంచి సివిల్స్ వరకు జరిగే పోటీ పరీక్షలలో డిగ్రీ సిలబస్ నుంచే ప్రశ్నలు వస్తున్నాయి. డిగ్రీ కనీస అర్హతగా కొనసాగుతోంది కాబట్టి విద్యార్థులు కోర్సును ఎంచుకునే ముందు ఆలోచించి తమకు అనుగుణంగా ఉన్న కోర్సును ఎంపిక చేసుకోవాలి. పట్టుదలతో నిరంతరం శ్రమించి డిగ్రీ విద్యతో పాటు తగిన నైపుణ్యాలు పెంపొందించుకుంటే భవిష్యత్‌లో మంచి రంగంలో స్థిరపడేందుకు అవకాశం ఉంటుంది.
– డా.రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, దోస్త్ జిల్లా సమన్వయకర్త, నిర్మల్

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ WE are READY TO INVEST TO DEVELOP YOUR BUSINESS. we also Welcome Agents. Good Salary & Commission. Cont: 9092692403 [IA-017]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185076]

■ మా కంపెనీలో పనిచేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. వయసు 18 నుండి 26 సంవత్సరాలు లోపు వారు చదువు అవసరం లేదు. వసతి ఫ్రీ. జీతం: 10000-15000. సంప్ర॥ 9849316058 [W-1242458]

■ హైదరాబాద్‌లోని స్టార్ హోటల్స్‌లో క్యాటరింగ్ బాయ్స్ & గర్ల్స్, హెల్పర్స్, సె॥గార్డ్స్, సూ॥వైజర్స్ కావలెను. రూమ్+భోజనం ఫ్రీ. జీ:18,000/- to 30,000/- చదువులేకున్నా. ఫోన్: 9989930582 [H-801622]



■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K ఫోన్: 9160900024/9640400073 [H-799880]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ ఆఫీస్ అసిస్టెంట్స్, నర్సులు, లేడీ కేర్ టేకర్స్, ఆయాలు, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901 [HA-14041]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,